



# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 165 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

02-05-2026 శనివారం వెల : 1 /- పేజీలు : 4


## హెల్మెట్ లేక రోడ్డెక్కితే... ప్రాణాలతో ఆటే!

- రోడ్లపై వేగం పెరిగింది... ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి
- ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా బలవుతున్నారు
- తలకు గాయాలే ప్రాణనష్టానికి ప్రధాన కారణం
- ఒక్క హెల్మెట్‌తో ప్రాణాలు కాపాడుకోవచ్చు
- పోలీసుల భయంతో కాదు... భద్రత కోసం ధరించాలి
- "అభయం"తో జిల్లాలో అవగాహన కార్యక్రమాలు
- కుటుంబం కోసం... ప్రతి రైడర్ హెల్మెట్ తప్పనిసరి

**నవతరం ప్రతినిధి, శ్రీకాకుళం**

రోడ్లపై వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. అదే సమయంలో ప్రమాదాలు కూడా అధికమవుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల విషయంలో హెల్మెట్ ధారణ ఇంకా నిర్లక్ష్యంగానే కనిపిస్తోంది. ఒక్క హెల్మెట్ ప్రాణాలను కాపాడగల రక్షణ కవచమని నిపుణులు చెబుతున్నారు.ప్రతి సంవత్సరం జరిగే రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో పెద్ద శాతం ద్విచక్ర వాహనదారులేనని గణాంకాలు చెబుతున్నాయి. అందులో తలకు గాయాలే ఎక్కువగా ప్రాణనష్టానికి కారణమవుతున్నాయి. హెల్మెట్ ధరించి ఉంటే చాలా ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడుకోవచ్చని ట్రాఫిక్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. హెల్మెట్ ధరించకపోవడానికి చాలామంది అసౌకర్యం, వేడి, అలవాటు లేకపోవడం వంటి కారణాలు చెబుతున్నారు. కానీ ఇవి ప్రాణాల కంటే ముఖ్యమా అనే ప్రశ్నకు సమాధానం ఒక్కటే. లక్షల రూపాయలు వెచ్చించి బైక్ కొనుగోలు చేసే వారు, కొద్ది వందల రూపాయల హెల్మెట్ కొనడంలో నిర్లక్ష్యం చూపడం ఆందోళనకరం.నిపుణుల సూచనల ప్రకారం ఐఎస్ఐ మార్క్ ఉన్న హెల్మెట్‌ను సరైన విధంగా బిగించి ధరించడం అత్యంత అవసరం. కేవలం పోలీసుల భయంతో కాదు... స్వీయ భద్రత కోసం హెల్మెట్‌ను అలవాటు చేసుకోవాలి.ఇటీవల జిల్లాలో "అభయం" వంటి కార్యక్రమాల ద్వారా హెల్మెట్‌పై అవగాహన పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. హెల్మెట్ బ్యాంక్ వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా హెల్మెట్ లేని వారికి తాత్కాలికంగా అందజేసే విధానం కూడా ప్రారంభమైంది.రోడ్డు మీద ప్రతి ప్రయాణం ఒక బాధ్యత. మన కోసం ఎదురుచూస్తున్న కుటుంబాన్ని గుర్తుంచుకుని, చిన్న జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరం. అందుకే ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించాలి.

**రోడ్లపై రోజురోజుకు వాహనాల వేగం పెరుగుతోంది. కానీ భద్రతపై నిర్లక్ష్యం మాత్రం అలాగే కొనసాగుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తూ ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారు. చిన్న జాగ్రత్త ప్రాణాలను కాపాడుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.**

## తూర్పుకాపులకు న్యాయం చేయాలి



- బీసీ-డి కోటా 12 శాతానికి పెంచాలి
- ఓబీసీ రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీ కమిషన్‌కు వినతిపత్రం

**నవతరం, శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం బీసీ రిజర్వేషన్లపై 'డెడికేటెడ్ కమిషన్' బహిరంగ విచారణను ఏపీ బీసీ కమిషన్ చైర్మన్ శ్రీ రాజీవ్ రంజన్ మిశ్రా (మాజీ ఐఏఎస్) నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శ్రీ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమక్షంలో ఈ బహిరంగ విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఆలిండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ నేతృత్వంలో ప్రతినిధి బృందం కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. రాష్ట్రంలో బీసీ కులాల్లోనే అత్యధిక జనాభా కలిగిన తూర్పుకాపు కులం రిజర్వేషన్ల పరంగా అనేక దశాబ్దాలుగా అన్యాయానికి గురవుతోందని పేర్కొన్నారు. బీసీ-డి కేటగిరీలో అనేక కులాలను చేర్చడం వల్ల తూర్పుకాపులు తీవ్రంగా నష్టపోయారని, ప్రస్తుతం ఉన్న 7 శాతం రిజర్వేషన్‌ను 12 శాతానికి పెంచాలని కోరారు. అలాగే ఉత్తరాంధ్ర మినహా ఇతర జిల్లాల్లో నివసిస్తున్న తూర్పుకాపు కులానికి ఓబీసీ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీకేఎస్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు కొవగాపు గౌతమ్, ఉద్యోగ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాడవలస సురేష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గొర్లె జగన్నాథం నాయుడు, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్లె అనురాధ, జిల్లా ప్రధాన కార్యదర్శి రౌతు నారాయణరావు, జిల్లా కోశాధికారి ధనుంజయరావు, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి శ్రీమతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## త్రిమూర్తుల కలయికతో రాష్ట్రాభివృద్ధి

- వేగంగా ముందుకు ఆంధ్రప్రదేశ్
- శ్రీకాకుళంలో కేంద్ర మంత్రి పర్యటన
- కోట్ల పనులకు శంకుస్థాపనలు



**నవతరం, శ్రీకాకుళం**

ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల కలయికతో రాష్ట్రం అభివృద్ధి వైపు వేగంగా అడుగులు వేస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లాలో సుడిగాలి -మిగతా 2లో

## రూ.114 లక్షల తారు రహదారి ప్రారంభం

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా ప్రారంభం
- ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొన్నారు
- గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం
- ప్రజలు, రైతులకు ప్రయోజనం

2లో



## ఒకటో తేదీనే పింఛన్లు.. చంద్రబాబు ఘనత

వర్షంలోనూ ఆగని ఎన్టీఆర్ భరోసా పంపిణీ

సంక్షేమంలో ఏపీ దేశానికే ఆదర్శం

స్వర్ణాంధ్ర దిశగా కూటమి పాలన

2లో



ఎడిటోరియల్

# మక్క రైతుకు మద్దతేది?

మొక్కజొన్న పంట కొనుగోలు వ్యవస్థపై ఏర్పడిన సంక్షోభం, రైతుల జీవనాధారాన్ని ఎంతగా కుదిపేస్తోందో ఇటీవల పరిస్థితులు స్పష్టంగా చెబుతున్నాయి. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) భరోసా లేకపోవడం, ధర ప్రకటించినా సరైన కొనుగోలు యంత్రాంగం ఉండకపోవడం.. ఇవి రెండూ కలిసి రైతును మరింత అసహాయ స్థితిలోకి నెట్టేశాయి. "పంట పండించు.. రైతును రాజుగా చేస్తాం" అన్న నినాదం కాగితం మీదే మిగిలిపోయి, నేలమీద కూడా రైతు తన పంటను అమ్ముకునే పరిస్థితి లేక తలదించుకునే దశకు పాలకులు తీసుకురావడం బాధాకరం. అన్ని పంటలకూ కనీస మద్దతు ధరగ్యారంటీ చేస్తూ చట్టబద్ధత కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులకనుగుణంగా ఉత్పత్తి ఖర్చులకు యాభై శాతం కలిపి (సీ2) ఎంఎస్‌పి అమలు చేయాలని కొన్నేండ్లుగా రైతులు ఆందోళనలు చేస్తూ ఉన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటలు కొనుగోలు చేయాలని కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు, మద్దతు ధర అటుంచితే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మొత్తానికే పంటల సేకరణకు ఉద్వాసన పలుకుతుండటం గమనార్హం. మార్కెట్‌లో రైతులకు పంట ధరలు పతనమైన సందర్భాల్లో ప్రభుత్వ సంస్థలు నేరుగా మార్కెట్‌లో జోక్యం చేసుకొని మద్దతు ధరపై పంటలను కొనుగోలు చేసేవి. మద్దతు ధర లేని పంటలను సైతం ప్రైస్ సపోర్ట్ స్కీం (పీఎస్‌ఎస్) కింద రైతులు నష్టపోకుండా ధర నిర్ణయించి కొనుగోలు చేసేవి. ఇక నుంచి కేంద్రం అనుసరిస్తున్న విధానాలతో ప్రభుత్వ సంస్థలు నేరుగా రైతుల నుంచి పంటలను సేకరించేందుకు నిరాకరిస్తున్నాయి. మద్దతు ధర లేని కొన్ని పంటలకు గతేడాది ప్రయోగాత్మకంగా ప్రైస్ డిఫరెన్స్ పేమెంట్ (పీడీపీ)ను కేంద్రం అమలు చేసింది. దేశవ్యాప్తంగా ఈ పథకం అమలులో లేదు. మధ్యప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసినా రైతులకు ఉపయోగ పడటం లేదు. అక్కడున్న రాష్ట్రప్రభుత్వాలూ చేతులెత్తేశాయి. తెలంగాణాలో ధర అమాంతం పడిపోయినా, రైతులు ఆర్తనా దాలు పెక్కటిల్లుతున్నా ప్రభుత్వ సంస్థలు కొనుగోలు కేంద్రాలు కావాల్సినన్ని ఏర్పాటు చేయకుండా రైతులను గాలికొది లేశారు పాలకులు.


దీనకంతటికీ కేంద్రప్రభుత్వ విధానాలే కారణం. తాజాగా యుద్ధం సాకు చూపి పంటలు కొనుగోలు చేయడానికి నిరాకరించింది. దీంతో ఎగుమతులు నిలిచిపోవటంతో మొక్కజొన్నలను కేంద్రం కొనుగోలు చేయడం లేదు. మద్దతు ధర ఉన్నా సక్రమంగా అమలు కాక వ్యాపారులు, దళారుల చేతుల్లో రైతులు దోపిడీకి గురవుతున్నారు. ఈసారి విపరీతమైన దిగుబడులు వచ్చాయి. ఎకరానికి 30నుంచి 40 క్వింటాళ్ల పంట పడింది. కోతలు పూర్తయ్యి పంట కొనుగోలు కేంద్రాలకు తరలించిన ప్రస్తుత తరుణంలో రైతాంగం అవస్థలు ఎదుర్కొంటోంది. రైతుల ఒత్తిడితో పేరుకు కేంద్రాలు తెరిచినా ఏ ఒక్కచోటా కొనుగోళ్లు సాగడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో రూ.2,400 ధర ఉన్నా ప్రయివేటు వ్యాపారుల వైపు మొగ్గుచూపుతున్నారు. క్వింటా రూ.1600కే విక్రయిస్తూ...ఒక్కో క్వింటాపై రూ.800 వరకూ నష్టపోతున్నారు.

మద్దతు ధరఉన్న పంటలక్కూడా ధరలు పతనమైన సందర్భాల్లో ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకొని రైతుల నుంచి నేరుగా పంటలను సేకరిస్తే, వ్యాపారులు కొంతైనా దిగొచ్చే అవకాశం ఉంది. ఆ మేరకు కొంతైనా రైతులకు ధర వస్తుంది. ఈ విధానం అమలులో ఉంది. అయితే, పంటల సేకరణ ఖర్చుతో కూడుకున్నదని మోడీ ప్రభుత్వం.. సేకరించిన పంటల నిల్వ, నిర్వహణ, అమ్మకం.. ఇబ్బందులని పేర్కొని క్రమంగా పంటల సేకరణ నుంచి వైదొగులుతోంది. ఈ క్రమంలో ఎఫ్‌సిఐ, నాఫెడ్ వంటి సంస్థలను నిర్వీర్యం చేస్తోంది. వ్యయప్రయాసలకు ఓర్చి మొక్కజొన్నలు కొనుగోలు కేంద్రాల్లో అమ్మినా రాష్ట్రప్రభుత్వం చొరవ తీసుకుని డబ్బులు ఇప్పిస్తుందా? అంటే అనుమానమే.

కేంద్ర ప్రభుత్వం ఒకప్పుడు రైతును రాజును చేస్తామని ఇచ్చిన హామీలు, ఇప్పటికీ రైతుల మదిలో నిలిచే ఉన్నాయి. కానీ ఆ హామీలు అమలులోకి రాకపోవడం వల్ల, రైతుల్లో నిరాశ పెరుగుతోంది. వ్యవసాయం లాభసాటి వృత్తిగా మారా లంటే, కేవలం నినాదాలు సరిపోవు. స్థిరమైన విధానాలు, బలమైన మార్కెట్ వ్యవస్థ, రైతుకు తక్షణ సహాయం అవసరం. ఈ నేపథ్యంలో, ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలి. మొక్కజొన్నకు సరైన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. రైతులకు పారదర్శకమైన మార్కెట్ వ్యవస్థ కల్పించాలి. వాటిని కార్యరూపంలో చూపినప్పుడే రైతు రాజవుతాడు తప్ప మాటలతో కాదు.

# మండల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థి సంతోష్ సాహు

**నవతరం -కవిటి**



శ్రీకాకుళం జిల్లాలోని కవిటి మండలం లొండపుట్టుగ గ్రామానికి చెందిన విద్యార్థి సంతోష్ సాహు పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. మొత్తం 585 మార్కులు సాధించి తన కృషి, పట్టుదలతో అందరి ప్రశంసలు అందుకున్నాడు.జెడ్‌పిహెచ్‌ఎస్ మాణిక్యపురం పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న సంతోష్ సాహు ప్రారంభం నుంచే చదువుపై ప్రత్యేక దృష్టి సారించి క్రమశిక్షణతో ముందుకు సాగాడు. ప్రతిరోజూ నిరంతర సాధన చేస్తూ, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ లక్ష్యసాధనలో ముందంజలో నిలిచాడు.

ఈ సందర్భంగా సంతోష్ సాహు మాట్లాడుతూ, తన విజయానికి కారణమైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశాడు. కష్టపడి చదివితే ఎవరైనా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపాడు.మండల స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన సంతోష్ సాహు భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆకాంక్షించారు.

అతని ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

# ఒకటో తేదీనే పింఛన్లు.. చంద్రబాబు ఘనత

**నవతరం, శ్రీకాకుళం**

ప్రతి నెల ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దకే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయిస్తున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిదేనని ఏపీ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ నాయకుడు పీఎంజే బాబు అన్నారు.

స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాల మేరకు గురువారం రెండో డివిజన్ ఆదివారంపేట సచివాలయం పరిధిలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఒకవైపు వర్షం పడుతున్నప్పటికీ పింఛన్ల పంపిణీ నిరాటంకంగా కొనసాగిందన్నారు. ఒకటో తేదీ వచ్చిందంటే లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదురుచూస్తుంటారని, వారి ఆశలను నెరవేర్చుతూ ప్రతి నెల సమయానికి ఇంటివద్దకే పింఛన్లు అందజేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని పేర్కొన్నారు.

వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4 వేలు చొప్పున, దివ్యాంగులకు రూ.6 వేలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు చొప్పున ప్రతి నెల అందజేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం, విజన్, మంత్రి నారా లోకేష్ స్పీడుతో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాలతో స్వర్ణాంధ్ర దిశగా దూసుకెళ్తోందని అన్నారు. కూటమి ప్రభుత్వ పాలన నభూతో నభవిష్యత్‌గా నిలుస్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాజారావు, జగన్, బాలకృష్ణ, రమణ, సచివాలయ సిబ్బంది జ్ఞానేష్, వనిత, వినీల, భారతి, ధనలక్ష్మి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మే డే దినోత్సవ సంబరాలు

## సిఐటియు టెక్కలి మండల కమిటీ



**నవతరం టెక్కలి**

ప్రపంచ కార్మిక సంఘ దినోత్సవసందర్భంగా టెక్కలి శంబాన వీధిలో గల సిఐటియు కార్యాలయంలో సిఐటియు సీనియర్ నాయకులు నంబూరు షణ్ముఖరావు జండా ఆవిష్కరణ జరిపారు. అనంతరం బెండి హరి అధ్యక్షతన సభ నిర్వహించారు.వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి యల్లయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబరు కోడ్ లను తీసుకొచ్చి కార్మికుల కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకొంటున్నది, మరోప్రక్క నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతు, పేదల భూములను తీసుకొని కార్పొరేట్ కంపెనీలు కు మేలు చేస్తుంది. గావున కార్మికులు ఐక్యంగా ఉండి పోరాటాలు నిర్వహించడమే మేడే స్ఫూర్తి అన్నారు. యుటియఫ్ నాయకులు పి.ధర్మారావు మాట్లాడుతూ సంపద సృష్టించే కార్మికులు కు నేడు పాలకులు సహాయ పడవలసింది పోయి దోపిడీ వర్గాలు కే సహాయ పడుతున్నారు అనేది మనకు అర్ధం అవుతుంది. భవణ నిర్మాణ కార్మికులు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కార్మిక సొమ్మును ను ప్రభుత్వం అన్యాయంగా వాడు కొన్నది, గావున సంక్షేమ బోర్డు పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

సమావేశం లో రైతుసంఘం నాయకులు బగాది వాసుదేవరావు, అరుణ్ కుమార్,దాలయ్య, దుర్గా ప్రసాద్ మేస్త్రీ లు, గ్రానైట్ వర్కర్స్ పోలయ్య,గూన త్రినాథ్, తిర్లంగి అప్పన్న,భూషణ్, ధనుంజయ, పోలయ్య, ఆనంద్, రాజు తదితరులు పాల్గొన్నారు. మేడే వర్ధిల్లాలి, వర్ధిల్లాలి, కార్మిక ఐక్యత వర్ధిల్లాలి, సిఐటియు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

# రూ.114 లక్షల తారు రహదారి ప్రారంభం

**నవతరం -పలాస**

పలాస మండలం కొబ్బరి చెట్లూరు రైల్వే గేట్ నుండి నీలావతి వయా కొత్తూరు వరకు రూ.114 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన తారు రహదారిని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష సంయుక్తంగా ప్రారంభించారు.

ప్రాంత ప్రజల దీర్ఘకాలిక అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రహదారి నిర్మాణం చేపట్టగా, పనులు పూర్తవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఈ రహదారి ద్వారా కొబ్బరి చెట్లూరు, నీలావతి, కొత్తూరు పరిసర గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు ఎంతో ప్రయోజనం పొందనున్నారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రహదారులు, వంతెనలు, ప్రజా సౌకర్యాల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ పలాస నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# త్రిమూర్తుల కలయికతో రాష్ట్రాభివృద్ధి

మొదటిపేజీ తరువాయి

పర్యటన చేపట్టిన ఆయన పలాస, ఇచ్చాపురం నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. పలాస నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి రూ.68.39 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రూ.64 కోట్లతో నిర్మించనున్న సున్నాదేవి రైల్వే ఆర్వోబీకి శంకుస్థాపన చేశారు. జాతీయ రహదారి నుంచి కొబ్బరి చెట్లూరు వరకు రూ.1.50 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు, కొబ్బరి చెట్లూరు రైల్వే గేటు నుంచి చిన్న సుమ్మాదేవి వరకు రూ.1.75 కోట్లతో నిర్మించిన రోడ్డు, కొబ్బరి చెట్లూరు రోడ్డు నుంచి కొత్తూరు వరకు రూ.1.14 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఇచ్చాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అశోక్తో కలిసి పర్యటించారు. కవిటి మండలం కరపాడు ఆర్వోబీ, కంచిలి మండలం జాడుపూడి ఆర్వోబీలకు శంకుస్థాపన చేశారు. జాడుపూడి రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు.బసవకొత్తూరు గ్రామంలో జరిగిన సభలో రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, గత పాలనలో రాష్ట్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొందని, ప్రజలు ప్రత్యక్షంగా అనుభవించిన తర్వాతే అభివృద్ధి విలువ అర్థమైందన్నారు. త్రిమూర్తులైన మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంతో రాష్ట్రం మళ్లీ పురోగతి బాట పట్టిందని తెలిపారు.ప్రస్తుతం పింఛన్ల నుంచి సంక్షేమ పథకాల వరకు పారదర్శకంగా అమలు చేస్తున్నామని, గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసినా ఇప్పుడు సంపద సృష్టించి ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ఇచ్ఛాపురం నియోజకవర్గం తనకు ఎప్పుడూ ప్రత్యేకమని, జాడుపూడి రైల్వే స్టేషన్‌ను కూడా మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చాపురాన్ని గేట్‌వే ఆఫ్ ఆంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దే బాధ్యత తాను, ఎమ్మెల్యే అశోక్ తీసుకున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఫార్మన్ అహ్మద్ ఖాన్, జనసేన నాయకులు, కూటమి శ్రేణులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రంలోనూ.. టౌన్‌లోనూ శ్రీ చైతన్య టాప్

- పదో తరగతి ఫలితాల్లో ఘన విజయాలు
- 100 శాతం ఉత్తీర్ణతతో మరోసారి సత్తా
- విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభినందనలు



**నవతరం, శ్రీకాకుళం**

పదవ తరగతి ఎస్ఎస్సి ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థలు మరోసారి విజయ పతాకాన్ని ఎగరవేశాయని ఉత్తరాంధ్ర ఏజీఎం ఎం.వి. సురేష్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలోనూ, శ్రీకాకుళం టౌన్ స్థాయిలోనూ ప్రథమ స్థానాలు సాధించడం శ్రీ చైతన్యకే సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో స్థానిక బలగానందంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. 596 మార్కులతో సూర సంజన పాఠశాల ప్రథమ స్థానం సాధించింది. 595 మార్కులతో పాగోటి శివాని ద్వితీయ స్థానం దక్కించుకోగా, 594 మార్కులతో కంచరపు వేరొనిక, పెటికం హరిశ్రీ, తీర్లంగి పూజిత తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే 593 మార్కులతో పోలాకి ప్రసన్న లక్ష్మి, 590 మార్కులతో పెద్దాపు లోకేష్ ప్రతిభ చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ ఇంద్రమౌళి తెలిపారు. ఈ ఫలితాల్లో 580కు పైగా మార్కులు 22 మంది, 550కు పైగా 91 మంది, 500కు పైగా 62 మంది విద్యార్థులు సాధించారు. పాఠశాల మొత్తం 100 శాతం ఉత్తీర్ణత నమోదు చేయడంతో పాటు, సగటు 538 మార్కులు సాధించడం విశేషమన్నారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని రీజనల్ ఇంచార్జ్ రామినాయుడు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఉత్తరాంధ్ర ఏజీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ జగదీష్, సి ఇంచార్జ్ మల్లేశ్వరరావు, ప్రైమరీ ఇంచార్జ్ ఉషారాణి, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ యశోద, పదో తరగతి ఇంచార్జ్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆ నలుగురే...ఆరడుగుల నేలే...!

ఓ మిత్రమా...
నా ప్రియ నేస్తమా...
జీవిత రథంలో
దారిచూపే చక్రాలువారు
అందుకే ఎవరినీ నిందించకు...

వంచించారని...
వేషాలు వేసారని...
వెన్నెలలో నవ్వి చీకటిలో
లోతుగా గోతులు తీశారని...

తేనె పూసిన కత్తులని
మాటల్లో మనసులో మాధుర్యం...
గుండెల్లో గాయాలు
దాచుకుంటారని...

అన్నిటికీ ఒకేతీర్పు నిజం కాదు
నింద కాదు.....నిగ్రహం కావాలి...

ఓ మిత్రమా...
నా ప్రియ నేస్తమా...
నిజానికి మన మార్గంలో
తారస పడేది నలుగురే...

ఉత్తములు...
ఉదయ సూర్యకిరణాలు...
మనసుని తాకి
ఆనందాన్ని ఔషధంలా
చిమ్ముతారు
ఆరోగ్యాన్ని ఆయుధంలా
అందిస్తారు

మధ్యములు...
మేఘాల గర్జనలు...
గుండెల్లో గునపాలు గుచ్చినా
వానగా కురిసి ఆ గుండెల్లోనే
గుణపాఠాల విత్తనాలు
నాటుతారు

అధములు...
అమాయకపు మబ్బుల్లో
దాగిన అజ్ఞానపు అంధకారాలు...
అవమానాల ముళ్లతో గుచ్చినా
అనుభవాల దీపాలు వెలిగిస్తారు

హితులు...
చంద్రికల్లా చల్లని నీడలు...
మనసుని ముద్దాడే మౌనగీతాలు...
మన మంచిని కోరే
జీవిత జ్ఞాపకాలపు జ్యోతులు...

కానీ మిత్రమా...
ఒక్క సత్యం మాత్రం
సదా గుండెల్లో గుర్తుంచుకో...

చివరికి మన యాత్రకు
సాక్షులు ఆ నలుగురే...
మన గమ్యానికి
హద్దులు ఆరడుగుల నేలే...!



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# కార్మికుల హక్కులు కాపాడాలి

- భద్రతపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
- మత్స్యకారులకు బీమా కల్పించాలి
- డా. సీపాన గుణవతి డిమాండ్



**నవతరం-సోంపేట**

కార్మికుల హక్కులు, భద్రత, సంక్షేమంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా కన్వీనర్, సంఘ సేవకురాలు డాక్టర్ సీపాన గుణవతి డిమాండ్ చేశారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా బారువ సాగర తీరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.
రాష్ట్రంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. భద్రతా ప్రమాణాలపై సరైన మార్గదర్శకాలు జారీ చేయకపోవడం వల్ల ప్రతి ఏడాది ప్రమాదాల్లో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు నిత్యం ప్రమాదాల మధ్య జీవిస్తున్నారని, వారికి ప్రభుత్వం లేదా నిర్మాణ యాజమాన్యాల నుంచి సరైన భరోసా, రక్షణ లభించడం లేదన్నారు.
నిర్మాణ పనుల్లో చేరే ప్రతి కార్మికుడికి బీమా సదుపాయం కల్పించడం తప్పనిసరి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.
మత్స్యకార కార్మికులు సముద్రంలో చేపల వేటకు వెళ్లే సమయంలో అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, ప్రతి మత్స్యకారుడికి సమగ్ర బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు మరణాలు లేదా గాయాలు సంభవించినప్పుడు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.
ప్రైవేట్ షాపులు, మాల్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు గిట్టుబాటు వేతనాలు అందడం లేదని విమర్శించారు. కనీస వేతన చట్టాలను కఠినంగా అమలు చేసి, పని గంటలు, సెలవులు, ఇతర హక్కులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.
కార్మిక శాఖ అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. కార్మికుల సంక్షేమానికి అనుగుణంగా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి, వాటి అమలును పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు లోకినింది గోవిందరాజులు, జిల్లా అధ్యక్షుడు పిట్ట పోలయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.జి. ప్రసాద్, సోంపేట మండల కన్వీనర్ కడియం ప్రసాద్, మత్స్యకార సంఘం నాయకులు, కార్మిక సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం




- లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి
- కనీస వేతనం రూ.30 వేలు ఇవ్వాలి
- కార్మిక హక్కుల కోసం ఐక్య పోరాటం

**నవతరం -శ్రీకాకుళం**

మేడే అమరవీరుల స్ఫూర్తితో సమరశీల పోరాటాలకు కార్మికులు సన్నద్ధం కావాలని సీఐటీయూ కన్వీనర్ పనస రమేష్, యూటీఎఫ్ జిల్లా నాయకుడు దండు ప్రకాష్‌రావు పిలుపునిచ్చారు. గురువారం కొత్తూరు మండల కేంద్రంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. మేడే కార్మిక వర్గ దీక్షా దినమని, ప్రపంచవ్యాప్తంగా కార్మిక ఐక్యతకు ప్రతీకగా ఎర్రజెండా ఎగురుతుందని తెలిపారు. ఉరికొయ్యిలు, ఆత్మబలిదానాలు, త్యాగాలతో కార్మికులు సాధించుకున్న 8 గంటల పనిదినం సహా 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను కట్టుబానిసలుగా చేసిందని విమర్శించారు.
కార్పొరేట్ సంస్థల లాభాల కోసం కార్మికులను యథేచ్ఛగా దోపిడీ చేసేందుకు ఈ కోడ్‌లు తీసుకొచ్చారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తున్నాయని, శ్రమజీవులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని అన్నారు.
గత 12 ఏళ్లుగా కనీస వేతనాలు సవరించకపోవడంతో కార్మికులు దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు ఆకాశాన్నంటుతుంటే, వేతనాలు పాతాళంలో ఉన్నాయని విమర్శించారు.
కనీస వేతనం రూ.30 వేలుగా నిర్ణయించాలని, ఎన్నికల హామీ మేరకు స్కీమ్ వర్కర్ల వేతనాలు పెంచాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.
జిల్లాలో జీడి, కొబ్బరి, గ్రానైట్ తదితర పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు ప్రజల మద్దతుతో ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.కృష్ణ, సూర్యనారాయణ, రాము, శ్రీను, జమ్మయ్య, ఆనంద్, అప్పన్న, వసంతరావు, గోవిందమ్మ, సుశీల, కళావతి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# మీకు తెలుసా? ప్రహ్లాదుడు వరం ఎందుకు తిరస్కరించాడు?”

నృసింహ జయంతి సందర్భంగా
ప్రతి కుటుంబం
తెలుసుకోవాల్సిన నిజం!

రాత్రి...
ఇంటి బయట వర్షం
పడుతోంది.

చిన్న బాలుడు వినయ్ తన
తాతయ్య దగ్గరకు వచ్చి
అడిగాడు:

“తాతయ్య... దేవుడిని చూసిన
వాళ్లు డబ్బు, రాజ్యం, ఆయుష్షు
అడుగుతారు కదా?
అయితే ప్రహ్లాదుడు ఎందుకు
ఏమీ అడగలేదు?”

తాతయ్య కాసేపు మౌనంగా
నవ్వాడు.

“అదే ఈ కథలో ఉన్న అసలు
రహస్యం బాబూ...” అన్నాడు.

ఉగ్రనృసింహుడిని చూసి
దేవతలకే భయం!
హిరణ్యకశిపుడిని సంహరించిన
తర్వాత...
నృసింహస్వామి ఉగ్రరూపంలో
సింహాసనం మీద కూర్చున్నారు.

గోళ్లపై రక్తం...
కళ్లలో అగ్ని...
భూమి కంపించేలా ఉన్న ఆ
రూపాన్ని చూసి దేవతలకే
భయం వేసింది.

బ్రహ్మ వెళ్లలేదు.
శివుడు కూడా ఆగిపోయాడు.

లక్ష్మీదేవి కూడా దగ్గరకు
వెళ్లడానికి
సంకోచించింది.

అప్పుడు అందరూ ఒక
చిన్న బాలుడిని
ముందుకు పంపారు.

అతడే - ప్రహ్లాదుడు.

ఇక్కడే మొదలవుతుంది
అసలు సస్పెన్స్...
ప్రహ్లాదుడు దగ్గరకు
వెళ్లగానే...

ఉగ్రరూపంలో ఉన్న
స్వామి ఒక్కసారిగా
మారిపోయారు.

రెండు చేతులతో ప్రహ్లాదుడిని
పైకి ఎత్తుకుని తన తొడమీద
కూర్చోబెట్టుకున్నారు.

“నాకంటే దేవతలందరూ
భయపడుతున్నారు...
నీకు భయం లేదా?” అని
అడిగారు.

అప్పుడు ప్రహ్లాదుడు చెప్పిన
మాట...
ఇప్పటికీ భాగవతంలో
నిలిచిపోయింది.

“మీరు నా రక్షకులు స్వామీ...
మీ దగ్గర నాకు భయం
ఎందుకు ఉంటుంది?”

కానీ అసలు గొప్ప విషయం
ఇంకా తర్వాతే జరిగింది!




స్వామి ఆనందంతో అన్నారు:

“ఏదైనా వరం కోరుకో
ప్రహ్లాదా!”

ఇక్కడే చాలా మంది ఊహించని
మలుపు వచ్చింది.

రాజ్యం అడగలేదు.
సంపద అడగలేదు.
శత్రువుల నాశనం కూడా
కోరుకోలేదు.

బదులుగా ప్రహ్లాదుడు అన్నాడు:

“మా మాం ప్రలోభయా...”
“స్వామీ... నన్ను కోరికలతో
ప్రలోభపెట్టకండి!”

దీనికి భాగవతంలో ఉన్న
ఋజువు:

-మిగతా తరువాయి
సంచికలో...

# సిరిమానోత్సవానికి విద్యుత్ శాఖ సేవలు ప్రశంసనీయం

- నెలరోజులుగా ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఆటంకం లేకుండా ఉత్సవం విజయవంతం
- సిబ్బంది కృషికి ప్రత్యేక అభినందనలు
- ఆసిరితల్లి కృపతో కార్యక్రమం ఘనంగా ముగింపు



**నవతరం -శ్రీకాకుళం**

గత నెల రోజులుగా శ్రీ శ్రీ శ్రీ ఆసిరితల్లి అమ్మవారి సిరిమానోత్సవ ఏర్పాట్లలో భాగంగా విద్యుత్ శాఖ చేపట్టిన పనులను సమర్థవంతంగా పూర్తి చేసి, ఎటువంటి అంతరాయం లేకుండా ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడంపై అధికారులకు భక్తులు, నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సందర్భంగా గౌరవ డీఈఈ/ఓ/శ్రీకాకుళం, ఈఈ/ఓ/శ్రీకాకుళం, ఎస్ఈ/ఓ/శ్రీకాకుళం అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
కార్యక్రమం చివరి వరకు అలుపెరగకుండా శ్రమించిన అరసవల్లి లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, లైన్‌మన్ లక్ష్మీనారాయణ, జేఎల్ఎం రాజు, కాంట్రాక్టర్ పాపారావులను అభినందించారు.
అలాగే సిరిమానోత్సవాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన అరసవల్లి, బలగ సెక్షన్ల సిబ్బందితో పాటు జేఈ/డి1/శ్రీకాకుళం, ఏఈఈ/ఓ/బలగ, ఏఈఈ/ఓ/గార అధికారులకు పేరు పేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
భక్తుల సహకారం, అమ్మవారి దయతో ఉత్సవం విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కమిషన్ విచారణ

- కలెక్టరేట్‌లో రాజీవ్ రంజన్ మిశ్రా ఆరా
- కుల సంఘాల నుంచి వినతుల వెల్లువ
- సమగ్ర నివేదిక ప్రభుత్వానికి : చైర్మన్

**నవతరం -శ్రీకాకుళం**

రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల (బీసీ) రిజర్వేషన్ల ఖరారుపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం నియమించిన డెడికేటెడ్ కమిషన్ శుక్రవారం శ్రీకాకుళం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బహిరంగ విచారణ నిర్వహించింది. కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అధ్యక్షతన, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమక్షంలో కార్యక్రమం జరిగింది.
ఈ సందర్భంగా జిల్లా అధికారుల నుంచి కీలక వివరాలను కమిషన్ సేకరించింది. గత ఎన్నికల్లో సర్పంచ్ స్థానాలు, వాటిలో బీసీలకు కేటాయించిన సీట్లు, గెలుపొందిన అభ్యర్థుల సంఖ్యపై జిల్లా పంచాయతీ అధికారిని అడిగి తెలుసుకుంది. అలాగే జడ్పీటీసీ స్థానాలు, పట్టణ ప్రాంతాల్లో బీసీ అభ్యర్థుల గెలుపు శాతం, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు కోరింది.



బహిరంగ విచారణలో పలు కుల సంఘాల ప్రతినిధులు తమ సమస్యలు, డిమాండ్లను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఉత్తరాంధ్ర యాదవ సంఘం ప్రతినిధులు తమను బీసీ-డి గ్రూపు నుంచి బీసీ-బి గ్రూపులోకి మార్చాలని కోరారు. అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక ఎంబీసీ గ్రూపు ఏర్పాటు చేసి విడిగా రిజర్వేషన్లు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.
రజక కార్పొరేషన్ డైరెక్టర్ దుర్గారావు మాట్లాడుతూ, కులవృత్తులపై ఆధారపడిన వెనుకబడిన వర్గాలు అభివృద్ధి చెందిన కులాలతో పోటీ పడలేకపోతున్నాయని, ఎంబీసీ గ్రూపు ద్వారానే న్యాయం జరుగుతుందని తెలిపారు.
చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో అందిన వినతులు, అధికారుల నివేదికలను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు.
కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వెంకట్రామన్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వినాయకం, ఈడి బీసీ కార్పొరేషన్ గడ్డెమ్మ, నోడల్ అధికారులు పి.వి.వి. ప్రసాదరావు, భారతి సౌజన్య, శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ కుర్మారావు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి

- మీడియా స్వేచ్ఛ హరించే పరిస్థితులు ఆందోళనకరం
- హోంమంత్రి అనితకు వినతిపత్రం అందజేసిన జోగినాయుడు
- జర్నలిస్టులపై దాడులకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**నవతరం -శ్రీకాకుళం**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మీడియా స్వేచ్ఛ హరించే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయని, జర్నలిస్టుల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకుని ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి శాసపు జోగినాయుడు డిమాండ్ చేశారు.

ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను విజయవాడలో కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. మీడియాకు సరైన రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, సమాజంలో జరుగుతున్న అక్రమాలు, అకృత్యాలను వెలికితీసి ప్రజలకు తెలియజేసే జర్నలిస్టులపై దాడులు జరగడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా పలమనేరు మండలం వీకోటకు చెందిన ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డిని వేటకొడవళ్లతో నరికి హత్య చేసిన ఘటనను తీవ్రంగా ఖండించారు. నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి, బాధిత కుటుంబానికి రూ.1 కోటి పరిహారం అందించాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి మానవతా దృక్పథంతో ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాల్గో స్థంభమైన మీడియాకు రక్షణ కరువైందని, ఇటువంటి పరిస్థితుల్లో జర్నలిస్టులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం తాత్సారం చేయకుండా దోషులను త్వరగా పట్టుకుని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి

- వజ్రపుకొత్తూరులో మేడే జెండా ఆవిష్కరణ
- కార్మిక, రైతు హక్కుల కోసం ఉద్యమాలకు పిలుపు

**నవతరం-వజ్రపుకొత్తూరు**



మేడే అమరవీరుల స్ఫూర్తితో సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షులు కే. బాలాజీ రావు, కే. హేమసూదనరావు, సిఐటియు నాయకులు కే. వెంకట్రావు పిలుపునిచ్చారు. శుక్రవారం బెండి గ్రామ బస్టాండ్ వద్ద మేడే జెండా ఆవిష్కరించి వారు మాట్లాడారు. మేడే కార్మిక వర్గం దీక్షా దినమని, ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గ పోరాటాలకు ప్రతీకగా ఎర్రజెండా ఎగురుతుందని తెలిపారు. కార్మికులు త్యాగాలతో సాధించుకున్న 8 గంటల పనిదినంతో పాటు 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను కట్టుబానిసలుగా మార్చిందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేందుకే ఈ చట్టాలు తీసుకువచ్చారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంపదను కార్పొరేట్ సంపదగా మారుస్తున్నాయని, శ్రమజీవులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని అన్నారు. గత 12 సంవత్సరాలుగా కనీస వేతనాలు సవరించకపోవడంతో కార్మికులు దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "ధరలు ఆకాశానికి -- వేతనాలు పాతాళానికి" ఉన్నాయని, కనీస వేతనాలు కూడా లేకపోతే కుటుంబాలను ఎలా పోషించగలరని ప్రశ్నించారు. కనీస వేతనం రూ.30 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం స్కీమ్ వర్కర్లకు వేతనాలు పెంచాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. జిల్లాలో జీడి, కొబ్బరి, గ్రానైట్ తదితర పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు ప్రజల మద్దతుతో ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. రైతులు పండించే అన్ని పంటలకు మద్దతు ధర హామీ చట్టం చేయాలని, రైతుల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి. హరికృష్ణ, గుట్ల మల్లేశ్వరరావు, టి. సింహాచలం, కె. కృష్ణారావు, ఎం. రమేష్, ఎం. నరేష్, డి. తెల్లవాడు, డి. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి ఫలితాల్లో శ్రీ చైతన్య ఘన విజయం

- ఇద్దరు విద్యార్థులు 596 మార్కులతో టౌన్ టాపర్స్
- శతశాతం ఉత్తీర్ణత 25 మందికి 590 పైగా మార్కులు

**నవతరం -శ్రీకాకుళం**



స్థానిక మహాలక్ష్మీనగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల పదో తరగతి ఫలితాల్లో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ పాఠశాలలో చదువుతున్న ఎం. యోగీశ్వరి, జె. సుచిత విద్యార్థులు 596 మార్కులు సాధించి పట్టణ టాపర్స్‌గా నిలిచారు. అలాగే ఎ. లలిత వైష్ణవి, పి. హర్షిత, డి. వెన్నిక, జి. మంజుశ్రీ తదితరులు 595 మార్కులు సాధించారు. మొత్తం 25 మంది విద్యార్థులు 590కు పైగా మార్కులు పొందగా, 78 మంది విద్యార్థులు 580కు పైగా మార్కులు సాధించడం విశేషం. శతశాతం ఉత్తీర్ణతతో బ్రాంచ్ సగటు 533 మార్కులు నమోదైనట్లు రీజియన్ ఇన్‌చార్జ్ ఎస్. రామినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. రాంప్రసాద్, బి. శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉత్తరాంధ్ర జిల్లాల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎం.వి. సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో 599 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన కె. జ్ఞానేశ్వరి, 598 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన ఐ. సాధ్వికలను ప్రస్తావిస్తూ విద్యార్థులను అభినందించారు. జోనల్ అకడమిక్ కోఆర్డినేటర్ ఎ. బాలరాజు మాట్లాడుతూ ఒకే బ్రాంచ్ నుంచి ఇద్దరు విద్యార్థులు 596 మార్కులతో టౌన్ టాపర్స్‌గా నిలవడం గర్వకారణమన్నారు. 25 మంది విద్యార్థులు 590కు పైగా మార్కులు సాధించడం సంస్థ ప్రతిష్ఠను పెంచిందన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ పి. కోటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ పి. లోకనాథరావు, ఐపీఎల్ ఇంచార్జీలు ఎ. హరి ప్రసాద్, బి. జనార్ధనరావు, సి అండ్ ఎం బ్యాచ్ ఇంచార్జి టి. రామ్మోహన్, లీడ్ బ్యాచ్ ఇంచార్జి కె. ఉత్తమ్ కుమార్, ప్రైమరీ కోఆర్డినేటర్ కె. అప్పారావు, పదో తరగతి ఇంచార్జీలు యు. సురేష్ కుమార్, పి. రంగబాబు పట్నాయక్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులను అందరూ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# స్మోకింగ్ "ఇక మానేద్దాం" టుబాకో కంట్రోల్ హీరో

**మాచన రఘునందన్**



"మే 31" వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా..ఈ నెల మొత్తం పొగాకు నియంత్రణ కు ప్రతి ఒక్కరూ.. సామాజిక బాధ్యత తో పాటుపడాలని టుబాకో కంట్రోల్ హీరో మాచన రఘునందన్ పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు ఆయన హైదరాబాద్ లో మాట్లాడుతూ..స్మోకింగ్ తో చేజేతులా ఆరోగ్యం చెడగొట్టుకునే బదులు, "ఇక మనేద్దాం" అని సంకల్పం తీసుకోవాలని స్పష్టం చేశారు. పలు సార్వజనిక ప్రదేశాలలో సిగరెట్, బి డి తాగుతున్న వాళ్లకు తనదైన శైలిలో పొగాకు వల్ల కలిగే అనర్థాలను వివరించారు. దమ్ము కొట్టడం మానేస్తే గుండె కు పండగ, ఊపిరితిత్తులకు ఉత్సవం అని రఘునందన్ ఉద్బోధించారు. స్కూళ్లు, కాలేజీల వద్ద పొగాకు నియంత్రణ చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతికి, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కి లేఖ రాసినట్లు రఘునందన్ వెల్లడించారు.

# వర్షంలో కూడా ఆగని పింఛన్ల పంపిణీ

- తడుస్తూనే పింఛన్లను అందజేసిన డివిజన్ ఇంచార్జ్ సూరిబాబు

**నవతరం -శ్రీకాకుళం**



నగరంలోని 31 డివిజన్ పరిధి దండివీధి, పట్నాయక్ కాలనీ లలో శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారుల ఇంటికి డివిజన్ ఇంచార్జ్, ఏపీ కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ విభూతి సూరిబాబువెల్ఫేర్ సహాయకులు రామారావు,సచివాలయం అడ్మిన్ తరుణ్, తో కలిసి పెన్షన్ లను అందజేశారు.

పెన్షన్లను అందుకున్న లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా విభూది సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లలో కొంత మొత్తం ఆదా చేసి ఆర్థికంగా ప్రతి పింఛనదారుడు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతీ నెల కొద్ది మొత్తంలో దాచుకోవడం వలన సంపదగా అభివృద్ధి చెందుతుందని లబ్ధిదారులకుబ్ సూచించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే గొండు శంకర్ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్ని చురుగ్గా చేపడుతున్నారని ,చంద్రబాబు నేతృత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని వివరించారు.

# 'నగరాల'ను బీసీఏలో చేర్చండి

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గిరిధర్**

**నవతరం -శ్రీకాకుళం**



సామాజికంగా ఆర్థికంగా రాజకీయపరంగా అట్టడుగున ఉన్న నగరాలు కులాన్ని బీసీ-ఎ జాబితాలో చేర్చాలని తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి(నగరాలు) రాష్ట్ర సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి నల్లాన వెంకటకృష్ణ గిరిధర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయంలో డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ శ్రీ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతి పత్రం సమర్పించారు. నగరాలు కులం వారు ఈ రాష్ట్రంలో అతి తక్కువ సంఖ్యలో ఉన్నారని, వీరంతా కడు దయనీస్థితిలో జీవనం సాగిస్తున్నారని గిరిధర్ పేర్కొన్నారు. సామాజికంగా ఆర్థికంగా చాలా వెనుకబడిపోయి ఉన్నామని, రాజకీయంగా ఎటువంటి ప్రాధాన్యత మాకు లేదని అన్నారు. వ్యవసాయ కూలీలుగా, భవన నిర్మాణ కార్మికులుగా కడు దీనస్థితిలో తమ జీవన ప్రయాణం సాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ రాష్ట్రంలో అతి తక్కువ జనాభా కలిగి ఉన్న మేము ఉద్యోగరీత్యా ఒక కలెక్టర్గా, ఎస్పీ గా కాలేనివారమని, అలాగే రాజకీయంగా ఒక ఎమ్మెల్యే , ఎంపీ కనీసం ఎమ్మెల్సీ ప్రాధాన్యత కూడా మాకు ఇంతవరకు దక్కలేదని అన్నారు. మేము కడు పేదవారమైన కారణంగా ఎటువంటి ఆర్థిక వనరులు సమకూర్చుకోలేక పోతున్నామన్నారు. ప్రస్తుతం మా కులం 'బి సి-డి' జాబితాలో ఉన్నందున అక్కడి పోటీని తట్టుకోలేక ఎటువంటి ఫలాలు మాకు దక్కడం లేదన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్న మా కులస్తుల దీనావస్థను డెడికేషన్ కమిషన్ వారు అన్ని కోణాల్లో పరిశీలించి 'నగరాలు' కులాన్ని బీసీఏ జాబితాలో చేర్పించి ఆదుకోవాలని గిరిధర్ విజ్ఞప్తి చేశారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**